ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

ఆలిండియా ట్రేడ్ టెస్ట్‌లో సీతంపేట ఐటిఐ విద్యార్థికి ఫస్ట్ ర్యాంకు

ప్రజాశక్తి-సీతంపేట

ఈ ఏడాది జులైలో జరిగిన ఆలిండియా ట్రేడ్ టెస్ట్‌లో సీతంపేట ప్రభుత్వ ఐటిఐ విద్యార్థి తంబర ఝాన్సీ లక్ష్మీబాయ్ ప్రథమ స్థానం సాధించింది. కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ (కోపా)లో 600 మార్కులకు గాను 600 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో సత్తాచాటింది. సవర రవీంద్ర డ్రెస్ మేకింగ్ ట్రేడ్‌లో 580 మార్కులతో బాలుర విభాగంలో రెండో ర్యాంకు సాధించాడు. రెండు సంవత్సరాల కోర్సుల్లో మూటక లావణ్య ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో 1200 మార్కులకు గాను 1193, సవర చరణ్ మెకానిక్ మోటార్ వెహికల్ ట్రేడ్‌లో 1192 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ మూటక గోపాలకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

అరటి ధర నేలచూపు

నెలలో 60 శాతం తగ్గిన వైనం ● నష్టాలు చవిచూస్తున్న రైతులు

అరటిధరలు రోజురోజుకూ నేల చూపులు చూస్తున్నాయి. గత నెల రోజుల నుంచి ధరలు భారీగా పతనమవుతు న్నాయి. 60 శాతం వరకు ధర తగ్గడంతో రైతులు నష్టం చవిచూడాల్సి వస్తోంది. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. పది నెలల పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరొకమారు తీవ్ర నష్టాలు తప్పవని దిగాలు పడుతున్నారు.

ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన గెలలు

ప్రజాశక్తి-సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యధికంగా అరటి పండించే నియోజకవర్గంగా సాలూరు పేరొందింది. 20 ఏళ్ల కిందటి వరకు ఈ ప్రాంతంలో సంప్రదాయక వ్యవసాయ పద్ధతులను అవలంబించి కేవలం సాగిస్తుండేవారు. కానీ ఉభయ గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన రైతులు ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేసి సంప్రదాయక వ్యవసాయంతో లాభాలు లేవని గ్రహించారు. వాణిజ్య పంటలు సాగుచేసి, లాభాలను పొందడం చూసి, ఈ ప్రాంత రైతులు కూడా చాలావరకు వారిని అనుసరించారు. వారితో పాటే వాణిజ్య పంటలను పండించడానికి సిద్ధపడ్డారు. అలా మొదలై వివిధ రకాలైన వాణిజ్య పంటలను సాలూరు ప్రాంతంలో సాగు చేస్తున్నారు. అందులో ముఖ్యమైనది అరటి. అరటి వేసిన రైతులకు వ్యాపారులు ముందుగానే పంట విస్తీర్ణం బట్టి అడ్వాన్స్ ఇస్తుంటారు. ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేలు వరకు ముందుగానే ఇవ్వడంతో వాటితోనే పెట్టుబడులు పెట్టి, వ్యవసాయం చేస్తూ లాభాలను ఆర్జిస్తుండేవారు. ఇక్కడి నుంచి అరటి ఎక్కువగా బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. గత కొన్నేళ్ల నుంచి ఈ ప్రాంతాలలో అరటి పంటను పండించడంతో అక్కడకు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ధర మందగిస్తూ రైతులు నష్టాలను చూడాల్సిన పరిస్థితులు దాపరించాయి. ముఖ్యంగా ఆయా రాష్ట్రాలలో పండగలు, శుభకార్యాల సమయాల్లో అధికంగా డిమాండ్ ఉండటంతో సంవత్సరంలో కొన్ని రోజులు మంచి ధర పొంది లాభాలు పొందుతుండేవారు. కానీ ఈ ఏడాదిలో నెల రోజుల క్రితం వరకు కిలో రూ.16 నుండి 20 వరకు కొనుగోలు చేసిన వర్తకులు.. నేడు రూ.8 మించి కొనడం లేదు. రైతులు సగానికి సగం నష్టపోవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు చాలా నష్టాలు చూసి ఈ వ్యవసాయాన్ని విరమించుకుందామా అన్న పరిస్థితులు కూడా చాలామంది రైతులు ఉన్నారు.

నెల రోజుల్లోపే..

పంట చేతికొచ్చే సమయానికే అరటి ధరలు సగానికి పైగా పడిపోతున్నాయి. నెల రోజుల ముందు వరకు టన్ను అరటి రూ.18 వేల నుండి 20 వేల వరకు వస్తుండేది. కానీ ఇప్పుడు రూ.8 వేలు వస్తుండటంతో చాలా నష్టపోవలసి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాయలను కొనేవాడు కూడా రావడం లేదు. ఏ రకం కూడా అమ్మకాలు జరగటం లేదని, ఎగుమతులు జరిగే ప్రాంతంలో అరటి పంట విస్తీర్ణం పెరిగిందని, దాంతో ఇక్కడ రకాలకు గిట్టుబాటు లేదని వ్యాపారులు చెప్తున్నారు. దీంతో రైతులు ఏమీ చేయలేక వారు చెప్పిన ధరకే అమ్మకాలను సాగిస్తున్నారు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడులు పెట్టి అరటి సాగుచేస్తే, దాని ద్వారా మద్దతుధర ఉంటే రూ.20 వేల నుంచి రూ.30 వేలు మిగులుతుందని రైతులు చెబుతున్నారు. ధర లేకపోవడంతో సగానికి పైగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోజురోజుకు ధర తగ్గిపోతుంది

రూ.లక్షల్లో ఖర్చు పెట్టి ఐదు ఎకరాలలో అరటిపంటను సాగు చేస్తున్నాను. దీని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకురావాలి. గత నెల రోజుల నుంచి ధరలు తగ్గుతూ వస్తుండడంతో నష్టాలు బారిన పడుతున్నాం.

- అప్పారావు, అరటి రైతు, కురుకుట్టి

ఉచిత బీమా కల్పించాలి

అరటి పంటకు ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తే రైతుకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ పంట సాగు చేయడం చాలా కష్టతరమైన విషయం. ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకొని ఈ పంటను కాపాడడం ఖర్చుతో కూడుకున్న పని. ఇటువంటి పంటను సాగు చేసే రైతులకు ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తే నష్టభయం లేకుండా ఉంటుంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

- వలిసి బలభద్ర, అరటి రైతు, పడాలవలస

ఎన్నాళ్లీ కక్ష సాధింపు?

- చిరుద్యోగులపై టిడిపి ఎమ్మెల్యేల ప్రతాపం
- 3 నెలల క్రితం కెజిబివి ఎస్ఒ, కుక్‌లపై వేటు
- 8 నెలల క్రితం అరసాడలో మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు
- సస్పెన్షన్ల ఎత్తివేతకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

కెజివిబిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేయడంతో ఉమ్మడి విజయనగరం జిల్లాలో అప్పటి ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎస్ఒ ప్రశాంతి (ఫైల్)

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో అధికారపార్టీకి చెందిన ఓ మంత్రి, ఓ ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు చిరుద్యోగులు బలయ్యారు. నెలలు గడుస్తున్నా వారి సస్పెన్షన్ల ఎత్తివేతకు జిల్లా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా చిరుద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయి. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న బడుగు జీవులే లక్ష్యంగా తొలగింపులు, సస్పెన్షన్లకు సిఫార్సు చేయడం, జిల్లా అధికారులు వాటికి వంతపాడడం జిల్లాలో పరిపాటిగా మారింది.

సాలూరు మండలంలోని కరాసువలస కెజిబివిలో పనిచేసిన ఎస్ఒ ప్రశాంతి సహా నలుగురు వంటమనుషులను సస్పెండ్ చేసి మూడు నెలలైంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సిఫార్సుల మేరకు కెజిబివి ఎస్ఒ ప్రశాంతి, నలుగురు వంటమనుషులను అధికారులు సస్పెండ్ చేశారు. మూడు నెలల క్రితం మంత్రి సంధ్యారాణి కరాసువలస కెజిబివిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నియోజకవర్గంలో అనేక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు ఉండగా కరాసువలస కెజిబివిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉందనే ప్రచారం జరుగుతోంది. తనిఖీల్లో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం, సరిపడిన పరిమాణంలో పంపిణీ చేయడం లేదనే విషయాన్ని ఆమె కనిపెట్టారు. దీనిపై ఆమె జిల్లా అధికారులకు సిఫార్సు చేసి ఎస్ఒ ప్రశాంతి సహా నలుగురు వంటమనుషులను సస్పెండ్ చేయించారు. నాణ్యమైన, బాలికలకు సరిపడిన పరిమాణంలో భోజనం పంపిణీ చేయలేదంటే కారణం వంట మనుషులు మాత్రమే. ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణంలో పాఠశాల స్టోర్ కీపర్, అకౌంటెంట్ బియ్యం, ఇతర వంట సరుకులను వంట మనుషులకు అందజేస్తారు. ఆ మేరకు వంట చేసి ఆహారాన్ని బాలికలకు పంపిణీ చేయాలి. ఈ వ్యవహారంలో ఎస్ఒ ప్రశాంతి పర్యవేక్షణ సరిగ్గా చేయకపోవడమే ఆమె చేసిన పెద్ద తప్పిదంగా భావించి మంత్రి సంధ్యారాణి ఆమెను కూడా సస్పెండ్ చేయించడం వివాదాస్పదమైంది.

ప్రశాంతి పివిటిజి గిరిజన మహిళ

సాలూరు మండలంలోని కరాసువలస కెజిబివి ఎస్ఒ ప్రశాంతి పివిటిజి తెగకు చెందిన గిరిజన మహిళ. ఆమె తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవుల కుటుంబం నుంచి వచ్చిన ప్రశాంతి అతి కష్టమ్మీద ఉన్నత విద్య చదివి కెజిబివి ఎస్ఒ ఉద్యోగం సాధించారు. ఆమె జీతంతోనే కుటుంబ పోషణ సాగుతోంది. ఆమె మరిపిల్లి, కరాసువలస కెజిబివి ఎస్ఒగా పని చేసిన సమయంలో జిల్లా అధికారుల ప్రశంసలు అనేక సార్లు అందుకున్నారు. కెజిబివి ఎస్ఒగా ప్రశాంతికి ఉన్నతాధికారుల వద్ద మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. అలాంటి అత్యంత వెనుకబడిన గిరిజన తెగకు చెందిన ప్రశాంతిని సస్పెండ్ చేయడాన్ని గిరిజన, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలుసార్లు వినతిపత్రాలు అందజేశాయి.

ఎండిఎం కార్మికుల తొలగింపుపై ఎమ్మెల్యే పెట్టు

పార్వతీపురం నియోజకవర్గంలో బలిజిపేట మండలం అరసాడ గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు మధ్యాహ్న భోజన కార్మికులను రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగించి ఎనిమిది నెలలు దాటింది. ఐదుగురు భోజన కార్మికులలో ముగ్గురు గిరిజన మహిళలే. మిగిలిన ఇద్దరు రజక మహిళలు. తొలగింపుపై వారు హైకోర్టుని కూడా ఆశ్రయించారు. హైకోర్టు వారికి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా వారి తొలగింపు ఎత్తివేత పై జిల్లా అధికారులు చర్యలు చేపట్టలేదు. కేవలం అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి వల్లే అధికారులు సస్పెన్షన్లను ఎత్తివేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అవార్డు అందుకుంటున్న గిరిజన మహిళ నవ్య

ఆదివాసీ మహిళకు ఏరువాక ఫౌండేషన్ అవార్డు

ప్రజాశక్తి-పార్వతీపురం

రసాయనాలు వినియోగించకుండా సేంద్రియ పద్ధతుల్లో పండించిన చిరుధాన్యాలతో అనేక రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేస్తున్న ఆదివాసీ మహిళ మర్రి నవ్యకు గుంటూరు కెఎల్ యూనివర్సిటీ ఏరువాక ఫౌండేషన్ అవార్డు అందించింది. శనివారం ఏరువాక ఫౌండేషన్ నిర్వహించిన కిసాన్ మహోత్సవం-2025 ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో మర్రి నవ్యకు అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. గుమ్మలక్ష్మీపురం మండలం పి.ఆమిటి పంచాయతీ వంజరపుగూడ గ్రామానికి చెందిన పివిటిజి గిరిజన తెగకు చెందిన మర్రి నవ్య సహా కొంతమంది మహిళలు చిరుధాన్యాలతో రకరకాల ఆహార ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఈ ఉత్పత్తులను రాష్ట్రంలో పలు పట్టణాలు, నగరాల్లో నిర్వహిస్తున్న మిల్లెట్ మేళాలు, డ్వాక్రా బజార్లలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీరి ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వంజరపుగూడ గ్రామానికి మహిళలకు తగిన చేయూత అందిస్తే వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశముంది.

రక్తదానం చేస్తున్న ఎస్ఐ అనిల్, యువకులు

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని పెదపెంకి గ్రామంలో భగత్‌సింగ్ జయంతిని ఆదివారం నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవనాయుడు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్రి ఈశు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని చిట్టిపూడివలస గ్రామంలో ఆదివారం భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

35 మంది రక్తదానం

సాలూరు : భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మీకై మేము స్వచ్ఛంద సంస్థ, శ్రీగౌరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన సాలూరులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 మంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని పట్టణ ఎస్ఐ అనిల్ ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ కూడా రక్తదానం చేశారు. విజయనగరంలోని ఎన్‌విఎన్ బ్లడ్‌బ్యాంకుకు అందజేస్తామని మీకై మేము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడు ఈశ్వరరావు, పంచాది శ్రీనివాసరావు, వంక మనోజ్, పసుమర్తి నరేష్ కుమార్, అక్కేన సన్యాసిరావు, గుల్లిపల్లి రాజగోపాల్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

మొక్కజొన్న తోటలో ఏనుగుల గుంపు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని నల్లరాయిగూడ, ఇసుకగూడలోని మొక్కజొన్న తోటలో నాలుగు ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది. ప్రస్తుతం మొక్కజొన్న పంట ఏపుగా పెరిగి, పంట రైతు చేతికి అందే దశలో ఉంది. ఈ దశలో ఏనుగులు మొక్కజొన్న తోటలో చొరబడట ంతో పంట నాశనం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న పంటకు నష్టం లేకుండా, పంటలు లేని ప్రదేశంలో ఏనుగుల సంచరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని రైతులు కోరారు.

మొక్కజొన్న తోటలో సంచరిస్తున్న ఏనుగులు

ఇళ్ల నిర్మాణానికి అవకాశమివ్వాలి

ప్రజాశక్తి-కొమరాడ

గతంలో ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన రేకు ఇళ్లు ఐడిలను రద్దుచేసి, కొత్తగా ఇళ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం కొమరాడలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో రేకిళ్లకు ఐడి తొలగించి కొత్తఇళ్ల మంజూరుకు అవకాశం కల్పించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గతంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు కట్టుకున్న 570 మంది లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. 2006లో మంజూరు చేసిన రేకు ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, కొత్తవి మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

ఇక్కడ పుట్టడమే నేరమా?

● రిజర్వేషన్లకు, హక్కులకు దూరమైన గిరిజనులు ● నాన్ షెడ్యూల్డ్ పంచాయతీల్లోని ఆదివాసీల ఆవేదన

మా గ్రామం నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంగా ఉండడంతో ఇక్కడ చదువుకున్న యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కోల్పోతున్నాం. నేను డిగ్రీ చదువుకున్నా రిజర్వేషన్ లేక ఉద్యోగం రాక నిరుద్యోగిగా ఉన్నాను. ప్రభుత్వం స్పందించి మా గ్రామాన్ని షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి.

- బిడ్డిక సంధ్యశ్రీ, గిరిజన యువతి, దుడ్డుఖల్లు

దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ ఏరియాగా ఉండడంతో ఇక్కడి ప్రజలు ప్రభుత్వ రాయితీలకు దూరంగా ఉన్నారు. ఐటిడిఎ ద్వారా ఎటువంటి రుణాలూ అందడం లేదు. దీంతో పూర్తిగా వెనుకబడి ఉన్నాం. ఇక్కడ పుట్టడమే మేం చేసిన నేరమా.?

- కొండగొర్రి గోపాలరావు, గిరిజన యువకుడు, దుడ్డుఖల్లు

అభివృద్ధికి దూరంగా ఉన్న దుడ్డుఖల్లు గ్రామం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలం నూటికి నూరు శాతం ఏజెన్సీ ప్రాంతం. అయినప్పటికీ దుడ్డుఖల్లు పంచాయతీ మాత్రం అందుకు భిన్నంగా నాన్ షెడ్యూల్డ్ పంచాయతీగానే పరిగణించబడింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఈ పంచాయతీలో నివశిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి రాయితీలూ రావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలకు రిజర్వేషన్లు కోల్పోతున్నారు. ఐటిడిఎ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న వ్యవసాయ రుణాలు, బోరు బావులు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదు.

గుమ్మలక్ష్మీపురం మండలం దుడ్డుఖల్లు పంచాయతీలో 15 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కొత్తవలస, బెల్లిడి, దొరజమ్ము, కంబగూడ, దొరకెక్కువ, కొల్లిగూడ, లోవలక్ష్మీపురం, విశ్వనాథపురం, దుడ్డుఖల్లు, బుడ్డెంఖర్జ, మేదరగండ, పిల్లిగూడ, బొడ్లగూడ, చింతలపాడు గిరిజన గ్రామాలు. ఇవి నాన్ షెడ్యూల్డ్ గ్రామాలుగానే పరిగణించబడుతున్నాయి. నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలని ఎన్నోసార్లు ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా నేటికీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పై గ్రామాల్లో నివసిస్తున్న వారు గిరిజనులుగా ఉన్నా రిజర్వేషన్ల ఫలాలు వీరిదరి చేరడం లేదు. దీంతో చదువుకున్న గిరిజన యువత నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు. గిరిజన రైతులకు ఎటువంటి వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందడం లేదు. ప్రతి ఏటా అప్పులు చేసి పంటలు పండిస్తున్నారు. పంటలకు నష్టం వాటిల్లిన ప్రభుత్వం నుంచి నష్టపరిహారమూ అందడం లేదు. పక్కా గృహాలు లేవు. తాగునీటి సమస్య వెంటాడుతోంది. పీసా, అటవీ హక్కుల చట్టాలు వీరికి వర్తించడం లేదు. నియోజకవర్గంలోని జియ్యమ్మవలస మండలం టికెజమ్మా, పిటిమండ, కురుపాం మండలం గుమ్మిడిగూడ గ్రామాలు నాన్ షెడ్యూల్డ్ జాబితాలో ఉన్నాయి.

నేటికీ వెనుకబాటు

మండలంలోని 27 పంచాయతీలు ఉండగా అందులో 26 పంచాయతీలు షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్నాయి. దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంగా ఉండటంతో గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు, ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ లేకుండా పోతుంది. ప్రభుత్వం ఈ సమస్యపై స్పందించి దుడ్డుఖల్లును షెడ్యూల్ ఏరియాగా గుర్తించాలి.

- నిమ్మక సింహాచలం, గిరిజన సంఘం నాయకులు

షెడ్యూల్డ్ జాబితాలో చేర్చాలి

దుడ్డుఖల్లు పంచాయతీ నాన్ షెడ్యూల్డ్ గ్రామంగా ఉండడంతో రాజ్యాంగం కల్పించిన హక్కులు గిరిజనులకు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగానికి రిజర్వేషన్ దూరమైంది. ఏళ్ల నాటి సమస్యను ప్రభుత్వం గుర్తించి షెడ్యూల్డ్ పరిధిలోకి తీసుకువస్తే యువత, మహిళలు, రైతులు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

- పి.తిరుపతిరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి

సిఎంకు వినతి అందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సిఎం దృష్టికి నాన్ షెడ్యూల్డ్ గ్రామాల సమస్య

గత కొన్నేళ్లుగా ఉన్న నాన్ షెడ్యూల్డ్ గ్రామాల సమస్యను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఏజెన్సీలో గిరిజనులు జీవనం సాగిస్తున్న నాన్ షెడ్యూల్డ్ గ్రామాలు కావడంతో రిజర్వేషన్లు కోల్పోతున్నారని సిఎంకు వివరించారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న దుడ్డుఖల్లు, టి.కె.జమ్ము, పి.టి.మండ, కొండచిలకాం, గుమ్మిడిగూడ పంచాయతీలకు చెందిన పలు గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలోకి మార్చాలని విజ్ఞప్తిచేశారు. నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కొత్త మండలాల ఏర్పాటులో భాగంగా కురుపాం మండలంలో ఉన్న నీలకంఠాపురం గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యలపై సిఎం చంద్రబాబు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

ఇఎస్ఐతో అనేక ప్రయోజనాలు

- అక్టోబర్ 1నుంచి కేసులు సెటిల్ మెంట్
- ఇఎస్ఐలో 74వేల మంది నమోదు
- డిసెంబర్ 31 వరకు ఎటువంటి ఫెనాల్టీలు లేకుండా కార్మికుల నమోదుకు అవకాశం
- 'ప్రజాశక్తి'తో ఇఎస్ఐ విజయనగరం జిల్లా మేనేజర్ జీవరత్నం ముఖాముఖి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కార్మిక రాజ్య బీమా సంస్థ (ఇఎస్ఐ) ద్వారా కార్మికులకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు విజయనగరం కార్మిక రాజ్య బీమా సంస్థ మేనేజర్ గొంటి జీవరత్నం తెలిపారు. 10 కంటే ఎక్కువమంది సంస్థ, కర్మాగారంలో కార్మికులు పనిచేస్తే ఇఎస్ఐలో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది జూలై 1 నుండి డిసెంబరు 31 వరకు ఇఎస్ఐ లో నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. కోర్టులో కేసులు వేసిన కార్మిక సంస్థలు కేసులను వచ్చే నెల అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు సెటిల్ చేసుకొని అవకాశాన్ని కల్పించిందన్నారు. ఎవరైతే ఇరవై ఒక్క వేలు, అంతకంటే తక్కువ జీతం వస్తుందో వారు ఇఎస్ఐలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రజాశక్తికి ముఖాముఖి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇఎస్ఐలో నమోదు చేసుకున్న కార్మికులకు ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయో వివరించారు.

? ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్ని కంపెనీల నుంచి ఎంతమంది కార్మికులు నమోదై ఉన్నారు?

జిల్లాలో కార్మిక రాజ్య బీమా సంస్థ కార్యాలయాలు విజయనగరం, గరివిడిలో ఉన్నాయి. డిస్పెన్సరీలు కొత్తవలస, బొబ్బిలి, నెల్లిమర్ల, గరివిడిలో ఉన్నాయి. విజయనగరం పరిధిలో 1850 సంస్థలు, కంపెనీల పరిధిలో 62వేల మంది, గరివిడి ఇఎస్ఐ పరిధిలో 450 సంస్థలు, కంపెనీల నుంచి 12వేల మంది కార్మికులు ఉన్నారు. విజయనగరం జిల్లా కేంద్రంలో డయాగ్నోస్టిక్ సెంటర్ ఉంది. పది పడకల ఆసుపత్రిని నిర్మించారు. ఇఎస్ఐ లో నమోదైన కార్మికులందరూ ఈ డిస్పెన్సరీలో వైద్య సేవలు పొందవచ్చు..

? ఇఎస్ఐలో కేసుల సెటిల్మెంట్లకు ఏమైనా విధానాలను తీసుకువచ్చిందా ?

ఇఎస్ఐ సంస్థ కంపెనీ యాజమాన్యాలపైగాని, కంపెనీ యాజమాన్యాలు ఇఎస్ఐపై గాని కోర్టుల్లో కేసులు వేసి ఎప్పటికీ సెటిల్మెంట్ కాకుండా ఉన్న కేసులను కోర్టు వెలుపల ఇఎస్ఐ ఆఫీసుల్లో విశాఖపట్నంలో సెటిల్మెంట్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇఎస్ఐ సబ్ రీజినల్ ఆఫీసు విశాఖపట్నంలో సంప్రదించాలి. ఈ అవకాశం అక్టోబర్ 1 నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వరకు ఏడాది పాటు ప్రభుత్వం కల్పించింది.

? ఎవరు ఇఎస్ఐలో నమోదు చేసుకోవచ్చు.?

పదిమంది కంటే ఎక్కువ మంది పనిచేసే సంస్థలు, కార్యాలయాలు వారిని ఇఎస్ఐలో నమోదు చేయాల్సి ఉంది. ఇఎస్ఐ లో నమోదు కాని కార్మికులకు ప్రభుత్వం ఎస్‌పిఅర్ఇఐ అనే పథకాన్ని తీసుకువచ్చింది. (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్ అండ్ ఎంప్లాయిస్) ఈ పథకం ద్వారా జూలై 1 నుండి డిసెంబర్ 31 వరకు నమోదు చేసుకుని అవకాశాన్ని కల్పించింది. సంస్థలో కర్మాగారంలో పనిచేస్తూ ఇఎస్ఐ లో నమోదు కాని కార్మికులకు ఈ అవకాశం లభిస్తుంది. సోషల్ సెక్యూరిటీ అధికారి తనిఖీ చేసి గత సంవత్సరములు కవర్ చేసి కంట్రిబ్యూషన్ ఇంట్రెస్ట్ డ్యామేజెస్ , లీగల్ యాక్షన్ లేకుండా ఈ స్కీము ద్వారా నమోదు చేసుకోవచ్చు. సంస్థల్లో పనిచేస్తూ ఇఎస్ఐలో నమోదు కాని కార్మికులకు ఈ అవకాశం ఉంటుంది. ఆయా సంస్థలపై చర్యలు ఉండవు.



? ఇఎస్ఐలో కార్మికులకు ప్రయోజనాలు ఏమిటి.?

ఇఎస్ఐలో నమోదు చేసుకున్న కార్మికులకు మెడికల్‌గా మూడు రకాలు వైద్యసేవలు అందిస్తారు. మెడికల్ సిక్‌నెస్, మెటర్నిటీ డిజేబుల్, డిపెండెంట్ బెనిఫిట్స్‌ను నగదు రూపంలో ఐదు రకాలుగా అందిస్తారు. కార్మికుడు ఆరు నెలలు పాటు డ్యూటీకి వెళ్లిన వెళ్లలేని పరిస్థితుల్లో ఇఎస్ఐ డిస్పెన్సరీ వైద్యంతో పాటు మెడికల్ లీవ్ సర్టిఫికెట్స్ ఇస్తారు. అటువంటి లీవులకు 70శాతం జీతం ఇఎస్ఐ చెల్లిస్తుంది. కేన్సరు కేటరాక్టు తదితర 34రకాల వ్యాధులకు రెండేళ్ల పాటు జీతంలో 80శాతం ఇఎస్ఐ చెల్లిస్తుంది. ట్యుబెక్టమీకి 14 రోజులు, వ్యాసెక్టమీ ఆపరేషన్లకు 7 రోజులు పాటు 100 శాతం జీతం అందిస్తారు. మహిళా కార్మికులకు తొమ్మిది నెలలు పనిచేసిన వారికి 70రోజులు పాటు పని చేసిన కార్మికులకు రెండు డెలివరీలకు 182 రోజులు మెటర్నిటీ లీవులతో పాటు పూర్తి వేతనం చెల్లిస్తారు. గర్భస్రావం జరిగితే 42 రోజుల పాటు 100శాతం జీతం అందిస్తారు. సరోగసి దత్తత తీసుకోవడం వంటి వాటికి 80 రోజులు పాటు 100శాతంజీతం అందిస్తారు.

? కార్మికులు గాయపడినా, మృతి చెందినా ఎటువంటి సదుపాయాలు కల్పిస్తారు?

విధి నిర్వహణలో గాని, ఇంటి నుండి విధులకు వెళ్లే సమయంలో గాని, పని ముగించుకుని ఇంటికి వచ్చే సమయంలో గాని ప్రమాదాలు జరిగితే సెలవులో ఉన్నంతవరకు జీతంలో సగం ఇఎస్ఐ చెల్లిస్తుంది. సెలవులు పూర్తయిన తర్వాత వారి శాశ్వత అంగవైకల్యం కలిగితే మెడికల్ బోర్డు ద్వారా నిర్ధారించి లాస్ ఆఫ్ ఎర్న్‌డ్ కెపాసిటీ గుర్తించి నెలవారి పింఛను అందిస్తారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మృతిచెందితే అతని కుటుంబానికి జీతం 90 శాతాన్ని పింఛన్‌గా నిర్ధారించి కుటుంబ సభ్యులకు తగిన వాటాల రూపంలో అందిస్తారు వారి భార్యకు జీవితాంతం, మగ పిల్లలకు 25శాతం ఆడపిల్లలకు పెళ్లయినంతవరకు చెల్లిస్తారు. కార్మికులు సాధారణంగా మతి చెందితే దహన ఖర్చులు రూ.15వేలు అందిస్తారు. ఇఎస్ఐ ఫెసిలిటీస్ లేనిచోట ప్రసవాలు జరిగితే రూ.7000 చొప్పున రెండు ప్రసవలకు అందిస్తారు. కార్మికులు రిటైర్ అయిన లేదా వాలంటీర్ గా రిటైర్మెంట్ తీసుకున్నా, కర్మాగారం మూతపడి ఉద్యోగం పోయిన సమయానికి ఐదేళ్ల ముందు వరకు ఇఎస్ఐలో రూ.10 చొప్పున చందా చెల్లించి ఉంటే కార్మికుడికి లేదా అతని భార్యకు ఏడాది పాటు మెడికల్ వైద్య సేవలు అందుతాయి.

నిరసన తెలుపుతున్న సర్పంచ్ రామయ్య, సిపిఎం నాయకులు, గిరిజనులు

అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-పాచిపెంట

అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, పోడు భూములకు పట్టాలు పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని శతాబి సర్పంచి శిల్పజన్ని రామయ్య కోరారు. మండలంలోని తంగలాం, గరిసగుడ్డి, శతాబి గ్రామాల్లో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, సర్పంచ్ రామయ్య, ఎస్.శ్రీరామ్ పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ నేటికీ పూర్తిస్థాయిలో గిరిజనులకు సాగుభూము లకు పట్టాలు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములపై హక్కులు లేకపోవడం వల్ల గిరిజనులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ చిట్టిపురం, తుమరవల్లి ప్రాంతాల్లో ఆంధ్ర జమిందారుల పేరుతో నేటికీ పట్టాలు మంజూరు చేయడం లేదన్నారు. గిరిజనుల సాగుచేస్తున్న భూముల్లో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించినా పరిహారం ఇవ్వలేదని చెప్పారు. సాగు భూములకు పట్టాలు మంజూరు చేసే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి చదల రాజు, గిరిజనులు స్వామి, ఎస్.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-వీరఘట్టం

రైతులకు యూరియా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేయడంతోపాటు ఎరువుల దుకాణ డీలర్లపై తగు చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జె.సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పిఎసిఎస్, మూడు ప్రయివేటు షాపుల్లో యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. ఎవరికి, ఏ విధమైన చీటీలు ఇవ్వలేదని, యూరియా కావలసిన రైతులు అందుబాటులో ఉన్న షాపుల వద్దకు వెళ్లి కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఇవ్వనన్నా, అధిక ధరలు చెప్పినా తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని రైతులను కోరారు.

మాట్లాడుతున్న సినీ గేయ రచయిత తుంబలి శివాజీ

జాషువా జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

గుర్రం జాషువా జయంతిని ఆదివారం పట్టణంలోని వేదాంత జూనియర్ కళాశాలలో స్నేహ కళాసాహితి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి సినీ గేయ రచయిత తుంబలి శివాజీ అధ్యక్షత వహించారు. చుక్క పారినాయుడు మాట్లాడుతూ జాషువా కవిత్వంలో మాధుర్యాన్ని, అంతస్సూత్రాలను వివరిస్తూ, దేశగతిని తన కవిత్వంలో భిన్నంగా కవిత్వీకరించారన్నారు. వివక్షతకు గురైన చోటే సత్కారాలు పొందిన కవి చక్రవర్తిగా నిలిచారన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు గంటేడ గౌరునాయుడు, డాక్టర్ వెంకటరావు, బెలగాం భీమేశ్వరరావు, పి.అప్పారావు, పక్కి రవీంద్ర, స్వామినాయుడు, తేజోమూర్తుల ప్రకాశరావు, సత్యనారాయణ, వి.శేషగిరి, గాయిత్రినాయుడు, రోహిణీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పెన్షనర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కురుపాం యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు గంటా జగన్నాథం ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్ల విశ్రాంతి భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులుగా టి.పాండురంగ, సహాధ్యక్షులుగా జి.దాలినాయుడు, ప్రధాన కార్యదర్శిగా టి.వి.ఎస్.ఎస్. సోమయాజులు, కోశాధికారిగా జామి రామకృష్ణతోపాటు మొత్తం 28 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాట్లాడుతూ నిరంతరం పెన్షనర్ల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాడతామన్నారు.

ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాజీ ఎమ్మెల్యేల పింఛన్లను పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ హర్షం వ్యక్తం చేశారు. తన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్న మాజీ ఎమ్మెల్యేల పింఛను పెంపుదల విషయంలో ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభ సదుపాయాల కమిటీ సిఫార్సుకు అనుమతి తెలపడం హర్షించదగ్గ విషయమన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో మోస్తరు వర్షం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో బురదమయంగా మారింది. దీంతో చిరు వ్యాపారులు, ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ఎస్ఐ ఎం.రాజేష్ ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని చెప్పారు. పెండింగ్ కేసుల చలానా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

హెచ్ఐవి, ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై వైడిఒ నెట్‌వర్క్ ఔట్రీచ్ వర్కర్ ఎ.గీతారాణి ఆదివారం కురుపాంలో డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఎలా వ్యాప్తి చెందుతుంది, దానివల్ల కలిగే అనర్థాలు, ఎయిడ్స్ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎపి శాక్స్ ఆధ్వర్యంలో డిజిటల్ సినిమా రూపంలో ప్రదర్శిస్తున్నట్లు గీతారాణి తెలిపారు. ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల ఎవరూ వివక్షత చూపకూడదని తెలిపారు.

ఘనంగా కోటకొండ దుర్గమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీలో గిరిశిఖర గ్రామమైన కోటకొండలో దుర్గమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అటు భామిని, ఇటు కురుపాం మండలాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా దుర్గమ్మను ఆరాధ్యదైవంగా భావిస్తారు. గిరిజనులు తమ ఇంట్లో జరిగే ప్రతి శుభకార్యానికి ముందుగా దుర్గమ్మను దర్శించుకుని పూజలు చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఆది, బుధవారాల్లో వందలాది మంది యాత్రికులు ఆలయాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. అందులో భాగంగా ఆదివారం భారీసంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

కురుపాం.. డప్పు వాయిద్యాలతో కోటకొండ దుర్గమ్మ ఆలయానికి వస్తున్న జనం

భామిని.. కోటకొండ దుర్గమ్మ ఆలయానికి ఊరేగింపుగా గుర్రంపై వెళ్తున్న నవీన్‌చంద్ర దొర

కాంట్రాక్టరు సహకారంతో..

మండలంలో జి.శివడ పంచాయతీ కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో కొండల మధ్యన ఉన్న దుర్గమ్మ తల్లి ఆలయానికి కనీసం రహదారి సౌకర్యం లేదు. గతేడాది కోటకొండ గ్రామానికి రహదారి వేసిన కాంట్రాక్టరును జి.శివడ గ్రామస్తులు గుడి కట్టించి, రహదారి వేయాలని కోరారు. ఆయన అందుకు అంగీకరించి గ్రామస్తులు సహకారంతో దుర్గమ్మ గుడి వరకు రహదారి మెట్లు వేయించి, గుడిని నిర్మించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి అంచలంచెలుగా ఆలయాన్ని అభివృద్ధి చేశారు. దీంతో ఈ ఏడాది ఉత్సవాలకు హాజరయ్యే యాత్రికుల సంఖ్య పెరిగింది.

ఘనంగా దసరా ఉత్సవాలు

భామిని : భామినిలో దసరా ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కృష్ణచంద్ర దొర కుమారుడు నవీన్ చంద్ర దొర సంప్రదాయ దొర వేషాధారణలో డప్పు వాయిద్యాలతో గుర్రంపై కోటకొండ దుర్గమ్మ ఆలయానికి వెళ్లారు. నవీన్ చంద్ర దొర కుటుంబ సభ్యులతో కలిసి దుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో దారి పొడవునా మహిళలు హారతులతో నవీన్ చంద్ర దొరకు స్వాగతం పలికారు. స్థానిక గిరిజనులు కూడా ఆదివారం దసరా ఉత్సవాలు నిర్వహించారు.

శరవేగంగా వంతెన పనులు

ప్రజాశక్తి-సీతానగరం

సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పాత వంతెనపై ఎక్కడికక్కడే గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వంతెన మరమ్మతులకు గురవడంతో గత ప్రభుత్వం కొత్త వంతెన నిర్మాణ పనుల కోసం రూ.12.50 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులు ప్రారంభంలోనే కాంట్రాక్టు చేయకపోవడం అప్పటి ప్రభుత్వం పూర్తి చేయలేదు. దీనికి తోడు ముడిసరుకు ధరలు పెరగడంతో కాంట్రాక్టరు ముందుకు రాలేదు.

కూటమి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత 2024లో ఈ వంతెన నిర్మాణం కోసం రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రస్తుతం ఈ వంతెన నిర్మాణ పనులు శరవేగంతో జరుగుతున్నాయి. 33 అడుగుల వెడల్పుతో వంతెన నిర్మిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికల్లా వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేస్తామని అధికారులు అంటున్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి అయితే వాహనదారులకు కష్టాలు గట్టెక్కినట్టేనని చెబుతున్నారు.

పూర్తయిన వంతెన శ్లాబ్‌కు చేరిన వంతెన పనులు

అర్ధాంతరంగా అంగన్వాడీ భవనాలు

కంబరవలసలో అర్ధాంతరంగా నిలిచిపోయిన అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి, గడగమ్మ, బిటివాడ, కంబరవలస, తదితర గ్రామాల్లో అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పౌష్టికాహారంతోపాటు విద్యను కూడా అందించాలని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు నాంది పలికింది. ఎక్కడా భవనాలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చిన్నారులకు, నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఇరుకైన గదుల్లో, అద్దె కొంపల్లో కొనసాగడంతో పిల్లలు, అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో ప్రధాన రహదారిలో మలుపుల వద్ద స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రంలోని తెలగ, అంబేద్కర్, జనవీధి ప్రధాన మలుపులతోపాటు చిదిమి, రేగులపాడు, బొడ్లపాడు, పాపంపేట, కడకల్లా, చిట్టిపూడివలస, చలివేంద్రి, మహదేవవలస, బూరుగ మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేవు. మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేవు. రహదారికి ఇరువైపులున్న పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే ఆర్అండ్‌బి అధికారులు స్పందించి ప్రధాన మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహదేవవలస వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

శిథిలావస్థలో పాఠశాల భవనం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పంచాయతీ దండుసుర, జి.డి.వలస గ్రామాల్లో ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఒక్కొక్క పాఠశాలలో సుమారు 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాంటి పాఠశాల భవనం పైభాగం పెచ్చులు ఊడి వర్షం పడేటప్పుడు కారిపోతూ ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వంటగది కూడా శిథిలావస్థకు చేరుకొంది. కనీసం తలుపులు లేక తడకలు పెట్టి విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలని పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న జి.డి.వలస పాఠశాల భవనం

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

అసలే ఆదివారం.. ఆపై దసరా సెలవులు.. ఇంకేముంది.. సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడం, అందులో దసరా సెలవులు రావడంతో పర్యాటకులు పిల్లలతో సరదాగా గడపడానికి పార్కుకు తరలివచ్చారు. పార్కులోని అందాలను ఆస్వాదించారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. ఆకాశంలో స్కై సైకిల్ ఎక్కి తొక్కారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద్ విహార్ వద్ద డ్యాన్స్ చేశారు. సాహసోపేతమైన క్రీడలు ఆడారు. 5డి థియేటర్‌లో అబ్బుర పరిచే సినిమాను వీక్షించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి జలకాలాడారు.

జలవిహార్ చేస్తున్న పర్యాటకులు

అడ్వెంచర్ బైక్ నడుపుతున్న బాలుడు

జిల్లేడు కషాయంతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-పాచిపెంట

అనేక పోషకాలతో కూడిన జిల్లేడు కషాయం పిచికారీ ద్వారా పంటలో పోషక లోపాలను సరిదిద్దవచ్చని, పురుగులు, తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. సిఆర్‌పి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో పాంచాలి గ్రామంలో రైతు నడిపూరి బోడినాయుడు 150 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని తయారు చేశారు. మాతుమూరు గ్రామంలో రైతు అల్లు గోవింద తయారుచేసిన 200 లీటర్ల జిల్లేడు ద్రావణాన్ని వరి పంటలో పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎఒ మాట్లాడుతూ జిల్లేడు ద్రావణం తయారీ చాలా సులభమని తెలిపారు. ప్రస్తుతం సాంబమసూరి వరి రకానికి సుడిదోమ ఆశించిందని, అక్కడక్కడ పిల్ల పురుగులు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈదశలో తూటికాడ కషాయం పిచికారీ చేసుకుంటే సుడిదోమను పూర్తిగా నివారించుకోవచ్చని తెలిపారు.

కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఎఒ తిరుపతిరావు